


నవోదయ ఏజెన్సీ
మాయాజాలం


# జర్నలిస్ట్ వార్త

RNI NO:Title-Code:-TELTEL02102

తెలుగు దిన పత్రిక

అనుక్షణం ప్రజల పక్షం...



WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103



సంపుటి - 1 సంచిక - 209 మంగళవారం 6 ఆగష్టు 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


## హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుపుతాం

- స్కిల్ వర్సిటీ ఛైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా
- స్కిల్ వర్సిటీ ఏర్పాటు ద్వారా నైపుణ్య శిక్షణ
- ప్రవాసాంధ్రులతో ముఖాముఖిలో సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ ఆగస్టు 5,(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఛైర్మన్‌గా ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా వ్యవహరిస్తారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పెట్టుబడుల వేటలో భాగంగా ప్రస్తుతంఅమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి.. న్యూజెర్సీలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. మిగతాది 2లో...



## యువతకు రుణాలిస్తాం


### పరిశ్రమలు పెట్టే యువతకు అన్ని విధాల సాయం

- మధిర ఇండస్ట్రియల్ పార్కుకు శంకుస్థాపన
- వ్యవసాయంతో పాటు పరిశ్రమలకు ప్రోత్సాహం
- డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి

యువత పరిశ్రమలు పెట్టేందుకు ముందుకొస్తే రుణాలతో పాటు అన్ని వసతులు కల్పిస్తామని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా మధిర నియోజక వర్గంలోని ఎండపల్లిలో ఇండస్ట్రియల్ పార్కు పనులకు భట్టి శంకుస్థాపన చేశారు. 2లో.

## పార్టీ ఫిరాయింపులపై ఢిల్లీలో న్యాయపోరాటం

### తెలంగాణలో ఉపఎన్నికలు తప్పవు... త్వరలో సుప్రీంకోర్టులో పిటిషన్ వేస్తాం: కేటీఆర్



**హైదరాబాద్ ఆగస్టు 5,(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలో ఉపఎన్నికలు తప్పవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జోస్యం చెప్పారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు తప్పదన్నారు. పార్టీ ఫిరాయింపులపై తమ పార్టీ ఢిల్లీలో న్యాయపోరాటం చేస్తుందన్నారు. రాజ్యాంగ నిపుణులతో పార్టీ సీనియర్ ప్రతినిధుల బృందం సమావేశమైనట్లు తెలిపారు. త్వరలో సుప్రీంకోర్టులో పార్టీ తరఫున పిటిషన్ వేస్తామన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ప్రజాక్షేత్రంలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత విషయంలో న్యాయపరమైన చర్యలు తీసుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నాలు ముమ్మరం చేసిందని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. మిగతాది 2లో...

## కెసిఆర్‌కు నోటీసులు



- కాళేశ్వరం వైఫల్యాలపై సెప్టెంబర్ 5న విచారణకు హాజరు కావాలని భూపాలపల్లి కోర్టు తాఖీదులు
- మాజీ మంత్రి హరీశ్‌రావు సహా పలువురు అధికారులు, చీఫ్ ఇంజనీర్లు, మేఘా సంస్థ ప్రతినిధులు సహా ఎనిమిది మందికి నోటీసులు జారీ చేసిన న్యాయస్థానం

## భగ్గుమన్న బంగ్లా

### భారత్‌కు చేరుకున్న షేక్ హసీనా...

ఆమె విమానాన్ని అనుసరించిన భారత వాయుసేన ఫైటర్ జెట్లు

భారత్ దౌత్య కార్యాలయం వద్ద భద్రత కట్టుదిట్టం

ఢాకాకు ఎయిరిండియా విమాన సర్వీసులు రద్దు



**హైదరాబాద్ ఆగస్టు 5,(జర్నలిస్ట్ వార్త):** బంగ్లాదేశ్ ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసిన షేక్ హసీనా సోమవారం సాయంత్రం 5.30 గంటలకు భారత్‌కు చేరుకున్నారు. బంగ్లాదేశ్ లోని ప్రస్తుత పరిస్థితుల్లో పదవికి రాజీనామా చేసిన ఆమె సురక్షిత ప్రాంతానికి చేరుకోవాలని భావించారు. ఈ క్రమంలో సాయంత్రం భారత్‌కు వచ్చారు. మిగతాది 2లో...

## ఫ్రెండ్లీ పోలీస్ కాదు.. ఇది లాఠీ పోలీస్

- బీఆర్ఎస్ మాజీ మంత్రి,ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి..
- షాద్ నగర్ దళిత మహిళను పరామర్శించిన బీఆర్ఎస్ బృందం..
- మహిళ అని చూడకుండా అవమానకరంగా కొట్టారు..
- సభ్య సమాజం తలదించుకోవాలి..
- పోలీసులకు ఇంత పొగరు ఎలా వచ్చింది..!? ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఫైర్..
- నందిగామా పోలీస్ స్టేషన్లో రౌడీషీటర్ తో పోలీసుల సెటిల్మెంట్లు
- : ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి ఆరోపణలు..
- కెసిఆర్ ఆదేశాల మేరకు సునితను పరామర్శించినట్లు వెల్లడి..
- బాధిత మహిళలకు ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి రూ.1లక్ష సాయం..
- బాధితురాలిని పరామర్శించిన ఎమ్మెల్సీ సురభి వాణీ,?
- మాజీ ఎంపీ మంద జగన్నాథం, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్,
- మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్..

4లో.




. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో హరిజన వాడకు చెందిన సునీతను పోలీసులు దొంగతనం కేసులో చిత్రహింసలకు గురి చేశారన్న ఆరోపణలపై ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో స్థానిక ఎమ్మెల్సీ ఎన్. నవీన్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ సారధ్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ సురభి వాణి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్,మాజీ ఎంపీ జగన్నాథం తదితర స్థానిక బీఆర్ఎస్ నాయకుల బృందం బాధితురాలు సునీతను ఆసుపత్రిలో పరామర్శించారు

# హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుపుతాం

(మొదటి పేజి తరువాయి)

స్కిల్ వర్సిటీ ఛైర్మన్‌గా ఆయన రెండు మూడు రోజుల్లో బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్ర యువతకు నైపుణ్యాలు నేర్పించేలా రంగారెడ్డి జిల్లాలో ముచ్చర్లలోని బేగరికంచెలో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణానికి సీఎం గత వారం శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. 17 రకాల కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ప్రైవేటు సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఏటా లక్షమందికి శిక్షణ ఇచ్చేలా రాబోయే కాలంలో ఈ వర్సిటీని విస్తరించనున్నారు. బేగరికంచెలో సొంత భవనం పూర్తయ్యే వరకు గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా భవనంలో వర్సిటీ కార్యకలాపాలు కొనసాగనున్నాయి. ఇకపోతే హైదరాబాద్‌ను ప్రపంచం లోనే అగ్రగామి నగరంగా నిలుపుతామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. న్యూజెర్సీలో ఆదివారం జరిగిన ప్రవాసుల ఆత్మీయ సమ్మేళానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ మీ జన్మభూమి, మీ దేశంలో మీరు పెట్టిన ప్రతి పెట్టుబడికి తప్పకుండా ప్రయోజనం ఉంటుంది. అంతకు మించిన అత్యుత్తమ ప్రతిఫలం ఉంటుందని అన్నారు. మన ప్రాంత అభివృద్ధిలో భాగస్వామ్యం పంచుకుంటే అంతకు మించిన సంతృప్తి బోనస్ గా లభిస్తుంది..'అని అన్నారు. ఎన్నికల ముందు మాపై ఎంతో విష ప్రచారం జరిగిందని, గిట్టని వాళ్లందరూ



అసలు కాంగ్రెస్ అధికారంలోకి రాదని అన్నారనని, వచ్చినా నిలబడదని అన్నారని సీఎం చెప్పారు. ఇప్పుడు రాష్ట్రంలో అభివృద్ధి మందగిస్తుందంటూ లేనిపోని అపోహలు సృష్టించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని అన్నారు. వాళ్లకు ఇప్పటికే బుద్ధి చెప్పామని, అబద్దాల కోరుల మాటలు తప్పని నిరూపిద్దామని , హైదరాబాద్‌ను భారతదేశంలోనే కాదు.. ప్రపంచంలోనే అగ్రగామి నగరంగా నిలుపుదామని సీఎం పిలుపునిచ్చారు. ప్రవాసులు తమ నైపుణ్యాలు, మీ ప్రతిభా పాటవాలతో అమెరికాను పటిష్టంగా, సంపన్నంగా మార్చారని, ఇకపై తెలంగాణకు సేవలు అందించాలని కోరారు. తెలంగాణలో మెట్రో కోర్



అర్బన్ తో పాటు , సెమీ అర్బన్, రూరల్ క్లస్టర్లుగా విభజించి పెట్టుబడులకు ప్రత్యేకమైన వ్యవస్థలను రూపొందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఈస్ట్ కోస్ట్ ఇండియన్ కమ్యూనిటీకి చెందిన పలువురు ముఖ్యులతో సీఎం మాట్లాడుతూ, హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తరహాలో నాలుగో నగరంగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ప్రపంచ స్థాయి మాస్టర్ ప్లాన్ తో హైదరాబాద్ ను తీర్చిదిద్దనున్నామని అన్నారు. ఓవర్సీస్ కాంగ్రెస్ పార్టీ అమెరికా అధ్యక్షుడు మొహిందర్ సింగ్ గిల్జియాన్ మాట్లాడుతూ.. 'మిమ్మల్ని ముఖ్యమంత్రిగా చూడాలన్న మా కోరిక నెరవేరింది. ఇప్పుడు రాహుల్ గాంధీని భారత ప్రధానిని చేయడానికి మనమందరం కష్టపడాలి' అన్నారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా, వ్యాక్సిన్‌లు, హెల్త్‌కేర్, అర్టిఫిషియల్ రంగాల్లో తెలంగాణ బలమైన స్థావరంగా ఎదగాలని ఆకాంక్షించారు.

# రుణమాఫీ కాని వారు వివరాలు తెలపండి

## వాట్సాప్ నంబర్ కేటాయించిన బిఆర్ఎస్ మాజీమంత్రి నిరంజన్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్ ఆగస్టు 5,(జర్నలిస్ట్ వార్త):**



రాష్ట్రంలో రుణమాఫీ కానీ రైతులకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలవాలని నిర్ణయించింది. లక్ష కానీ, లక్షన్నరలోపు కానీ బ్యాంకులో రుణం తీసుకొని ఉండి, మీకు రుణమాఫీ జరగకపోతే ఈ 8374852619 వాట్సప్ నంబర్‌కి మీ వివరాలు పంపాలని మాజీ వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి సూచించారు. మా తెలంగాణ భవన్‌లో ఇద్దరు వ్యక్తులను ఈ సమస్య మీదనే నియమించాం అని ఆయన తెలిపారు. తెలంగాణ రైతాంగానికి విజ్ఞప్తి చేస్తున్నాం. మీ పేర పట్టాదార్ పాస్ బుక్ కలిగి ఉండి, అదే పాస్ బుక్ మీద రుణం పొంది ఉండి, లక్ష కానీ, లక్షన్నర లోపు కానీ.. మాఫీ కాకపోతే బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌కు ఆ వివరాలు పంపొచ్చు అని నిరంజన్ రెడ్డి తెలిపారు. ఏ సర్వే నంబర్ మీద రుణం పొందారు.. ఏ గ్రామం, ఏ బ్యాంకు నుంచి రుణం తీసుకున్నారు అనే వివరాలతో ఇతర విషయాలను 8374852619 అనే నంబర్‌కు వాట్సాప్ చేయాలని సూచించారు. వివరాలతో మీ రిమార్క్స్ కూడా రాయండి. రుణమాఫీ ఎందుకు కాలేదు.. అధికారులు ఏమన్నారు..? వంటి వివరాలు రాసి పంపించండి అని నిరంజన్ రెడ్డి కోరారు. ఈ వివరాలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించి మాట్లాడుతాం. చర్చకు పెడుతాం. ప్రభుత్వం ఏం చెబుతదో ఆ వివరాలన్నింటిని సమాజానికి చెబుతాం. ప్రత్యక్షంగా మాటలు అవసరం లేదు.. ఎంత మందికి వచ్చాయి.. ఎంత మందికి రాలేదో తెలుసుకుందాం. రుణమాఫీ కాని వారికి కూడా వచ్చినట్లు చెబుతూ రైతులను, ప్రజలను మోసం చేస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వం. రేవంత్ సర్కార్ దుర్మార్గాన్ని ఎండగడుదాం. 2 లక్షల లోపు రుణాలను ఆగస్టు 15 నాటికి మాఫీ చేస్తామన్నారు. మరి రూపాయికి బదులు అమెరికా డాలర్లు తీసుకొచ్చి చేస్తారేమో చూద్దాం అని రేవంత్ సర్కార్‌పై నిరంజన్ రెడ్డి సెటైర్లు వేశారు.

# యువతకు రుణాలిస్తాం

**ఖమ్మం,ఆగస్టు 5,(జర్నలిస్ట్ వార్త):**
యువత పరిశ్రమలు పెట్టేందుకు ముందుకొస్తే రుణాలతో పాటు అన్ని వసతులు కల్పిస్తామని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా మధిర నియోజక వర్గంలోని ఎండపల్లిలో ఇండస్ట్రియల్ పార్కు పనులకు భట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మధిరలో ఏర్పాటవుతున్న ఇండస్ట్రియల్ పార్కు రాష్ట్రానికి రోల్ మోడల్‌గా ఉండాలన్నారు. సమాజంలోని అన్ని వర్గాలనూ ప్రోత్సహించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. మధిర పట్టణ విస్తరణకు కావాల్సిన బైపాస్ రోడ్లు నిర్మిస్తాం. ఇండస్ట్రియల్ పార్కుకు రూ.44కోట్లు కేటాయించాం. విద్య, వ్యవసాయక, పారిశ్రామిక కేంద్రంగా మధిరను నిలుపుతాం. వ్యవసాయంతో పాటు పరిశ్రమలు, సేవా రంగాలను అభివృద్ధిచేసుకొని సమగ్రాభివృద్ధి సాధించాలి. గ్రామాల్లో ఉన్నవారు పరిశ్రమల వైపు మళ్లితే ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సాహమిచ్చేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. రాష్ట్రంలోని యువత పరిశ్రమలు పెట్టేందుకు ముందుకు వస్తే రుణాలు ఇప్పిస్తాని.. అందుకు తగ్గ వసతులు కల్పిస్తామన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రతి ఏడాది 20వేల కోట్ల వడ్డీ లేని రుణాలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఈ డబ్బులు ఎక్కడ పెట్టుబడి పెట్టాలనే ఆలోచన వారికి ఉండదని.. అందుకే ప్రభుత్వమే పరిశ్రమలు, వ్యాపారానికి సంబంధించిన ప్రాజెక్టు రిపోర్టు, బ్యాంకు రుణాలు, మార్కెటింగ్ వసతులు కల్పించి పారిశ్రామిక రంగంలో వారిని ప్రోత్సహిస్తామని తెలిపారు. ఇలాంటి బృహత్తర



కార్యక్రమానికి మధిర నియోజకవర్గంలో పునాది పడిందన్నారు. ఎప్పుడూ వ్యవసాయం అని ఒకే రంగంపై ఆధారపడితే క్లిష్ట పరిస్థితులు వచ్చినప్పుడు ఇబ్బందులు పడతామని... వ్యవసాయంతో పాటు పరిశ్రమలు, సేవా రంగాలను అభివృద్ధి చేసుకొని సమగ్ర అభివృద్ధి సాధిస్తే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. గ్రామాల్లో బాగా చదువుకున్న వారు ఉన్నారని.. అందరికీ ఉద్యోగాలు రావని.. గ్రామాల్లో ఉన్నవారు పరిశ్రమల వైపు మళ్ళితే ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఇదే దేశ భవిష్యత్తుకు మంచిదని తెలిపారు. గ్రామాల్లో వ్యాపారం చేసేవారు సమాజంలో మారిన పరిస్థితులకు అనుగుణంగా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. గ్రామాల్లో వ్యాపారం చేసేవారు మరింత ముందుకు వెళ్లేందుకు బ్యాంకుల నుంచి సకాలంలో రుణాలు ఇప్పించి వ్యాపారులను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. మధిరలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయడం దశాబ్దాల కల అన్నారు. 55 ఎకరాల్లో నిర్మించనున్న పార్కుకు 44 కోట్ల నిధులు కేటాయించామని తెలిపారు. మధిర పార్కు పనులకు వెంటనే టెండర్లు పిలిచి వేగంగా పనులు ప్రారంభిస్తామని తెలిపారు. నిరుద్యోగ యువత పరిశ్రమల వైపు వచ్చేందుకు విస్తృతంగా ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించారు.మధిర ఇండస్ట్రియల్ పార్కును అనుసంధానించేందుకు రెండు వైపులా రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి యువత ఈ పారిశ్రామిక ప్రాంతాన్ని సందర్శించేలా తీర్చిదిద్దాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇండస్ట్రియల్ పార్కులో తక్కువ ధరలకే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్లాట్లు కేటాయిస్తామని.. కేటాయింపులో ఎస్సీ, ఎస్టీ, బీసీలతోపాటు మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు. సమాజంలో ఉన్న అన్ని వర్గాలను ప్రోత్సహించాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానికి మధిర సమీపంలో ఉందని.. విజయవాడ-నాగపూర్, దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవేలు మధిర నియోజకవర్గం మీదుగా వెళుతున్నాయని.. ఇవి అభివృద్ధికి మూల స్తంభాలుగా పనిచేస్తాయని తెలిపారు. మధిర పట్టణం విస్తరణకు కావలసిన బైపాస్ రోడ్లు నిర్మిస్తామని.. చదువుల కోసం, ఉపాధి కోసం మధుర నుంచి ఖమ్మం, హైదరాబాద్, అమెరికాలో స్థిరపడుతున్నారు ఇక్కడ సమగ్ర అభివృద్ధిని అందిస్తే వారంతా ఇక్కడే స్థిరపడతారని పేర్కొన్నారు. ఇండస్ట్రియల్ వద్ద ప్రత్యేకంగా ఒక ఉద్యోగిని నియమించి పరిశ్రమలు స్థాపించేందుకు వచ్చే వారి నుంచి దరఖాస్తులు తీసుకోవడం.. సమాచారం అందించడం వంటి బాధ్యతలు అప్పగిస్తామన్నారు.

# పార్టీ ఫిరాయింపులపై ఢిల్లీలో న్యాయపోరాటం

(మొదటి పేజి తరువాయి)

ఢిల్లీలోని పలువురు ప్రముఖ న్యాయ కోవిదులతో తన ఆధ్వర్యంలో పార్టీ బృందం చర్చలు జరిపిందన్నారు. అటు రాజ్యాంగ నిపుణులతోనూ ఈ రోజు పార్టీ ప్రతినిధి బృందం సమావేశమైందని వెల్లడించారు.ఇప్పటికే పార్టీ ఫిరాయింపుల విషయంలో మణిపూర్‌కు సంబంధించి సుప్రీంకోర్టు పలు తీర్పులు ఇచ్చిందని రాజ్యాంగ నిపుణులు ఆర్యమా సుందరం తమ పార్టీ బృందానికి తెలిపారని వెల్లడించారు. గతంలో మాదిరిగా అనర్హత వేటు విషయంలో సుదీర్ఘ కాలం పాటు నిర్ణయం తీసుకోకుండా స్పీకర్ ఈ అంశాన్ని నాన్చలేరన్నారు. ఈ సందర్భంగా ముగ్గురు ఎమ్మెల్యేల అనర్హత వేటుకు సంబంధించి హైకోర్టులో వేసిన పిటిషన్‌తో పాటు, పార్టీ మారిన ఎమ్మెల్యేల పైనా స్పీకర్‌కు చేసిన ఫిర్యాదు విషయాన్ని, వాటికి సంబంధించిన పత్రాలను న్యాయ నిపుణులకు బీఆర్ఎస్ నేతలు అందించారు.ఈ విషయంలో ప్రస్తుతం సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నందున హైకోర్టు కూడా ఎక్కువ కాలం వాయిదా వేసే అవకాశం ఉండదని న్యాయ నిపుణులు వెల్లడించారు. హైకోర్టు నిర్ణయం త్వరగా ప్రకటించకుంటే సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం ఉందన్నారు. సుప్రీంకోర్టు తీర్పులతో పాటు న్యాయకోవిదులు, రాజ్యాంగ నిపుణులు చెబుతున్న సలహాలు, సూచనల మేరకు న్యాయపోరాటం కొనసాగిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. త్వరలోనే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్నారు. హైకోర్టు లేదా సుప్రీంకోర్టు ద్వారా నెల రోజుల్లో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు అంశం తేలిపోతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.ఒకవైపు జాతీయస్థాయిలో పార్టీ ఫిరాయింపుల పైన సుద్దపూస ముచ్చట్లు చెబుతూ తెలంగాణ రాష్ట్రంలో రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. త్వరలో కోర్టుల సహాయంతో కాంగ్రెస్‌కు సరైన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

# భగ్గుమన్న బంగ్లా

(మొదటి పేజి తరువాయి)

ఇక్కడి నుంచి ఆమె నేరుగా లండన్ వెళ్లనున్నారు.షేక్ హసీనా ప్రయాణిస్తున్న బంగ్లాదేశ్‌కు చెందిన సీ-130 విమానం భారత గగనతలంలోకి ప్రవేశించిన వెంటనే భారత వైమానిక దళం యుద్ధ విమానాలు గాల్లోకి ఎగిరాయి. కొద్దిసేపు సీ-130 విమానాన్ని భారత ఫైటర్స్ జెట్లు అనుసరించాయి. ఈ సీ-130 విమానంలో షేక్ హసీనా భారత్ చేరుకున్నారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు భారత వాయుసేన, సైన్యం ముందే సిద్ధమైనట్లుగా విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.బంగ్లాదేశ్‌లోని హింసాత్మక ఘటనల దృష్ట్యా ఆ దేశంలోని భారత దౌత్య కార్యాలయం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. అదే సమయంలో ఢిల్లీలోని బంగ్లాదేశ్ దౌత్య కార్యాలయం వద్ద కూడా భద్రతను పెంచారు. బంగ్లాదేశ్ తాజా పరిణామాల నేపథ్యంలో ఢాకా నగరానికి ఎయిరిండియా విమానాలను రద్దు చేసింది. ఇప్పటికే టిక్కెట్లను కొన్న ప్రయాణికులకు అన్ని విధాలుగా సహకరిస్తామని తెలిపింది. ప్రయాణికులు, సిబ్బంది భద్రత అత్యంత కీలకమని ఎయిరిండియా వెల్లడించింది.

# కెసిఆర్‌కు నోటీసులు

**హైదరాబాద్ ఆగస్టు 5,(జర్నలిస్ట్ వార్త):**

కాళేశ్వరం ప్రాజె క్టు నిర్మాణంలో వైఫల్యాలపై విచారణ నిమిత్తం సె ప్టెంబర్ 5న విచారణ కోసం హాజరు కావాలంటూ భూపాలపల్లి కోర్టు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు నోటీసులు జారీ చేసింది. ఆయనతో పాటు మరికొందరికీ నోటీసులిచ్చింది. రూ.లక్ష కోట్ల వ్య యం చేసి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు నాటి కెసిఆర్ సర్కారే కారణమని, దీనివల్ల భారీగా ప్రజా ధ నం దుర్వినియోగం అయిందని, కాళేశ్వరం ప్రా జెక్టు లక్ష్యమే దెబ్బతిందని, దీనిపై సమగ్ర విచారణ చేయాలంటూ పిటిషనర్ నాగవెల్లి రాజలింగమూర్తి భూపాలపల్లి ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. బ్యారేజీ దెబ్బతి న్న అంశంపై సమగ్ర విచారణ చేయాలంటూ పో లీసు ఉన్నతాధికారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పిటిషనర్ వెల్లడించారు. కాళేశ్వరం ఎత్తిపోతల్లో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌తో పాటు నాటి మం త్రి హరీశ్‌రావు, నీటి పారుదల శాఖ కార్యదర్శి రజత్ కుమార్, అప్పటి సిఎంఒ కార్యదర్శి స్మితా సబర్వాల్, అప్పటి చీఫ్ ఇంజనీర్లు, మేఘా సంస్థ నిర్మాణదారులు భాగమేనని, వీరందరిపై విచారణ చేపట్టి శిక్షించాలని పిటిషనర్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

ప్రాజెక్టు వ్యయాన్ని పెంచి, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని, నిర్మాణానికి ముందు కనీసం సాయి ల్ టెస్ట్ కూడా చేయలేదని పిటిషనర్ ఆరోపించారు. పదే పదే డిజైన్లు మార్చారని, నిర్మాణంలో ఎక్కడా నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని పేర్కొన్నారు. వర్షాలు, వరదల ముందు, ఆ తర్వాత చేయాల్సిన పరీక్షలను, తనిఖీలను చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని గుర్తు చేశారు. మేడిగడ్డ నిర్మాణానికి సంబంధించిన పలు టెక్నికల్ అంశాలను డ్యామ్ సేఫ్టీ అథారిటీ కోరినా ఇవ్వకుండా లోపాలను దాచే ప్రయత్నం చేశారని పిటిషనర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను స్వీకరించిన భూపాలపల్లి కోర్టు, ఈ అంశంలో విచారణ నిమిత్తం సెప్టెంబర్ 5వ తేదీన హాజరు కావాలంటూ కెసిఆర్, హరీశ్ రావులతో పాటు మొత్తం 8 మందికి నోటీసులు జారీ చేసింది. అయితే, తొలుత ఫస్ట్ క్లాస్ ప్రిన్సిపల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ వేశానని, తన పిటిషన్‌ను కొట్టివేసిందని, దానికి కారణాలను కూడా తనకు తెలియజేయలేదని, విధిలేని పరిస్థితుల్లో హైకోర్టును ఆశ్రయించానని, ఆ తర్వాత రివిజన్ పిటిషన్‌ను జిల్లా కోర్టులో దాఖలు చేయాల్సిందిగా సూచించడంతో ఇప్పుడు దాఖలు చేయాల్సి వచ్చిందని రాజలింగమూర్తి పేర్కొన్నారు.బ్యారేజీలోని ఏడవ బ్లాకులో పిల్లర్ భూమిలోకి కుంగిపోవడం, పెద్ద శబ్దంతో ఒక పిల్లర్‌కు పగుళ్ళు రావడంతో అసిస్టెంట్ ఇంజినీర్ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, తీవ్రవాద శక్తుల ప్రమేయం ఉన్నదనే అనుమానాన్ని వ్యక్తం చేశారని, పోలీసులు కూడా ఐపిసిలోని సెక్షన్ 427 ప్రకారం ఎఫ్ఐఆర్ (నెం. 174/2023) నమోదు చేశారని, మరుసటి రోజే దాన్ని క్లోజ్ చేశారని పిటిషనర్ గుర్తు చేశారు. గత ఏడాది అక్టోబర్ 25న మేడిగడ్డ కుంగుబాటుపై పోలీసుస్టేషన్ లో ఫిర్యాదు నమోదు చేశానని, తర్వాత జిల్లా ఎస్పికి, డిజిపికి కూడా కంప్లైంట్ చేశానని రాజలింగమూర్తి పిటిషన్‌లో వెల్లడించారు. అయినా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో కోర్టుకెక్కినట్లు వెల్లడించారు. కాగా, కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో మేడిగడ్డ వద్ద నిర్మించిన లక్ష్మీ బ్యారేజీ అంతర్ రాష్ట్ర వంతెన కుంగిన విషయం విదితమే. బ్యారేజీ బి -బ్లాక్‌లో 19, 20, 21వ పిల్లర్ల మధ్య ఉన్న వంతెన సుమారు 30 మీటర్ల పొడవున ఒక ఫీటు వరకు కిందికి కుంగింది. రాత్రివేళ వంతెన కుంగిపోయిన విషయాన్ని మహారాష్ట్ర వెళ్లే ప్రయాణికులు గుర్తించి బయటకు చెప్పడంతో అధికారులు అప్రమత్తమయ్యారు.

# దళిత మహిళపై దాష్టీకం ఘటనలో పోలీసులపై వేటు

**హైదరాబాద్ ఆగస్టు 5,(జర్నలిస్ట్ వార్త):**



దొంగతనం విచారణలో దళిత మహిళను అరెస్టు చేసి థర్డ్ డిగ్రీ ప్రయోగించిన కేసులో పోలీసులను సస్పెండ్ చేస్తూ సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి ఆదేశాలు జారీ చేశారు. షాద్‌నగర్‌కు చెందిన సునీత అనే మహిళను దొంగతనం కేసులో డిఐ రామిరెడ్డి అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వచ్చారు. గత నెల 24వ తేదీన తన ఇంట్లో 22.5తులాల బంగారు ఆభరణాలు, రూ.2లక్షలు పోయాయని పిఎంపి వైద్యుడు షాద్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వైద్యుడి ఇంటి ఎదురుగా ఉన్న భీమయ్య, సునీత దంపతులను 26వ తేదీన డిటెక్టివ్ ఇన్స్‌స్పెక్టర్ రామిరెడ్డి విచారణ కోసం పోలీస్ స్టేషన్‌కు పిలిపించాడు. పోలీసులు దొంగతనం చేసినట్లు ఒప్పుకోవాలనిమహళపై ఒత్తిడి తేవడమే కాకుండా విపరీతంగా కొట్టారు. మహిళ దుస్తులు విప్పి, షార్ట్‌వేసి మహిళను ఆమె కుమారుడి ఎదుటనే చితకబాదడంతో తీవ్రంగా గాయపడింది. దెబ్బలకు తాళలేక మహిళ స్పృహ తప్పి స్టేషన్‌లోనే పడిపోవడంతో పోలీసుల వాహనంలోనే ఇంటికి పంపించారు. దీనిపై ఒక్కసారిగా విమర్శలు రావడంతో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డిఐ రామిరెడ్డిని కమిషనరేట్‌కు అటాచ్డ్ చేసి, ఎసిపి రంగస్వామిని విచారణ చేసి రిపోర్టు సమర్పించాలని ఆదేశించారు. ఈ మేరకు విచారణ చేసిన ఎసిపి సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌కు సమర్పించడంతో డిఐ రామిరెడ్డి, ఐదుగురు కానిస్టేబుళ్లు జాకీర్, అఖిల, మోహన్‌లాల్, రాజు, కరుణాకర్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

# క్లినిక్ పేరుతో అడ్డగోలు వైద్యం

- అనుమతులు లేకుండా నకిలీ నిర్వహణ - చారాన రోగానికి బారాన మందులు

- క్లినిక్ తో పాటు మందుల షాపు అతనిదే - నకిలీ నిర్వహణపై చర్యలేవి..?

**రాయపర్తి, ఆగస్టు 5,(జర్నలిస్ట్ వార్త):** గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ప్రాథమిక చికిత్సను అందిస్తూ వృత్తికి న్యాయం చేసే ఆర్ఎంపీ డాక్టర్లు కొంత మంది ఉన్నారు. మరి కొంతమంది ఆర్ఎంపీ డాక్టర్లు సంపాదనే లక్ష్యంగా తీసుకొని వైద్య సేవలను వ్యాపారంగా మార్చుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే రాయపర్తి మండల కేంద్రానికి చెందిన పెండ్యాల గణేష్ అనే వ్యక్తి తెలిపిన వివరాల ప్రకారం తమ కుటుంబ సభ్యుడికి ఆరోగ్యం బాగోలేక మండల కేంద్రంలోని ఓ క్లినిక్ ఆర్ఎంపీ డాక్టర్ వద్దకు తీసుకు వెళ్లినట్లు తెలిపారు. దీంతో ఆర్ఎంపీ డాక్టర్ బాధితుడికి గ్లూకోస్ బాటిల్ పెట్టారు. డాక్టర్ ఫీజ్ 2 వందలు, మందుల ఖర్చు పేరుతో 950 రూపాయలు మొత్తం 1150 రూపాయలు వసూలు



చేశారు. క్లినిక్ లో ఇంత ఖర్చు ఏంటని గణేష్ ప్రశ్నించగా ఆర్ఎంపీ డాక్టర్ అతన్ని కించపరిచే విధంగా మాట్లాడినట్లు వివరిస్తున్నారు. ఆర్ఎంపీ డాక్టర్ కి క్లినిక్, మందుల షాపు రెండు ఉండడంతో ఆయన గీసిందే గీత అన్న చందంగా బాధితులను నిలువునా దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ప్రాథమిక చికిత్స పేరుతో చారాన రోగానికి, బారాన మందులిచ్చి అడ్డగోలుగా డబ్బులు వసూలు చేస్తున్నారని బాధిత వ్యక్తి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా అనుమతులు లేని క్లినిక్ ఏర్పాటు చేసుకొని, గ్రామీణ ప్రాంతాల ప్రజలను మోసం చేస్తూ, అక్రమంగా సంపాదిస్తున్న నకిలీ ఆర్.ఎం.పి డాక్టర్ పై చర్యలు తీసుకోవాలని బాధితుడు వైద్యశాఖకు విజ్ఞప్తి చేస్తున్నారు.

# స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## - స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ టి బాలాజీ






చెన్నారావుపేట, ఆగస్టు 5,(జర్నలిస్ట్ వార్త): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛతనం పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చెన్నారావుపేట స్పెషల్ అధికారి డాక్టర్ టి. బాలాజీ అన్నారు. సోమవారం చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటి స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం 5వ, తేదీ నుంచి 9వరకు నిర్వహించబడునని తెలిపారు. సీజనల్ వ్యాధులపై వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది చేత ప్రజలకు అవగాహన కల్పించడం, ప్రభుత్వ కార్యాలయాలు, కూడళ్లు, రోడ్లను శుభ్రం చేయడం, మరుగుదొడ్లు లేని ఇళ్లను గుర్తించడం, ఇళ్లలోని చెత్తను సేకరించడం వంటి కార్యక్రమాలను అమలు చేయాలని గ్రామ పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఈ ప్రత్యేక కార్యక్రమాల్లో ప్రభుత్వ విభాగాలతో పాటు స్థానిక నాయకులు, యువకులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వార్డు కమిటీ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీవాణి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామపంచాయతీ సిబ్బంది ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ పనులను చేయాలన్నారు. ఖాళీ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కింద మొక్కలను నాటాలని తెలిపారు. ప్రతి గ్రామంలోనూ చేపట్టనున్న ముఖ్యమైన పనుల జాబితాను రూపొందించాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఒక మొక్కను దత్తత ఇస్తామన్నారు. పాఠశాలలోని మౌలిక వసతులను తీర్చాలని కోరారు. ఈ సందర్భంగా మండల స్పెషల్ ఆఫీసర్ బాలాజీ, ఎంపీడీవో శ్రీవాణి పాఠశాల ఆవరణాన్ని పరిశీలించారు. కూలిపోయిన చోట ప్రహరీ గోడ నిర్మించడం, పాఠశాల ఆవరణం చదును చేయడం, మురుగు నీరు బయటకు పంపేందుకు పైప్ లైన్లు ఏర్పాటు చేయడంపై దృష్టి పెడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్. శశిధర్, కె.సంతోష్ కుమార్, పిన్నింటి బాలాజీ రావు, ఉదయ్ కుమార్, ఎల్. మొగిలి, కె. మాధవి,జి సుందర్, రమాదేవి, క్రాఫ్ట్ టీచర్ టీచర్ ఇందిర, కలాం ఫౌండేషన్ సభ్యులు, యువజన సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని తహసిల్దార్ ఎం శ్రీనివాస్, ఎంపీడీవో జి కిషన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో స్వచ్ఛధనం, పచ్చదనం కార్యక్రమంలో బాగంగా గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పచ్చదనం స్వచ్ఛ ధనం ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాలలో పచ్చదనం పరిశుభ్రతను పెంపొందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం 5 రోజుల పాటు స్వచ్ఛధనం, పచ్చధనం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి కూచన ప్రకాష్, ఏపీవో కుమార్, ఏపీఎం కిరణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి వినోద్ కుమార్, కారోబార్ మల్లయ్య, గ్రామైక్య సంఘం సభ్యులు పిరని యాకయ్య, అంగన్వాడి టీచర్స్ చంద్రకళ, ఐత కృష్ణవేణి, శశిరేఖ, గారె కవిత, ఐత విజయరాణి తదితరులు ఉన్నారు.

# ఎల్లాయిగూడెం పాఠశాలను సందర్శించిన జడ్పీ సీఈఓ



చెన్నారావుపేట, ఆగస్టు 5,(జర్నలిస్ట్ వార్త): మండలంలోని ఎల్లాయిగూడెం గ్రామ ప్రాథమిక పాఠశాలను సోమవారం జడ్పీ సీఈవో రామ్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జడ్పీ సీఈవో రామ్ రెడ్డితో పాటు మండల స్పెషల్ ఆఫీసర్ బాలాజీ, ఎంపీడీఓ శ్రీవాణి పాల్గొని పాఠశాలను సందర్శించిన అనంతరం మొక్కలు నాటి స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలోని ముఖ్య అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాపయ్యపేట హెచ్ఎం ప్రభాకర్ రావు, పాఠశాల హెడ్ మాస్టర్ ఆంగోతు భద్రయ్య, టీచర్లు సత్యనారాయణ, స్వామి, యాకయ్య, పావని, రాణి, సునీత, పంచాయతీ కార్యదర్శి అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



# వికలాంగులకు బ్యాటరీ వెహికల్స్

## - అందజేసిన పరుపాటి శ్రీనివాస్ రెడ్డి

రాయపర్తి, ఆగస్టు 5,(జర్నలిస్ట్ వార్త): ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీనివాస్ రెడ్డి సోమవారం వికలాంగులకు బ్యాటరీ వెహికల్స్ అందజేశారు. రాయపర్తి మండలం కొండాపూర్ గ్రామ నిరుపేద కుటుంబానికి చెందిన వికలాంగులు ఎండి హుస్సేన్ స్థితిగతులు బాగాలేక ఇబ్బందులు పడుతున్నారు. సమాచారం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఎస్టీసెల్ ఉపాధ్యక్షులు సురేందర్ నాయక్ ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళారు. తక్షణమే స్పందించిన వారు వికలాంగులైన హుస్సేన్ కు సోమవారం బ్యాటరీ వెహికల్ అందించి అండగా నిలిచారు. ఇలా మండల పరిధిలో ఎలాంటి సహాయం చేయడానికైనా వెనకాడకుండా, కుల, మతాలకతీతంగా సహాయ, సహకారాలు అందిస్తున్న ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మెన్ పరిపాటి శ్రీనివాస్ రెడ్డికి మండల ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఈ కార్యక్రమంలో మాదారపు అశోక్, అంజిరెడ్డి, ఎన్ఎస్యుఐ పీహెచ్సీ నాయకులు సుధాకర్, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# కంఠమహేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతి



చెన్నారావుపేట, ఆగస్టు 5,(జర్నలిస్ట్ వార్త): మండల కేంద్రంలోని కంఠమహేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గీత కార్మికులు ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో కంఠమహేశ్వర స్వామి ఆలయం లేక 15 సంవత్సరాలుగా స్వామివారికి ఉత్సవాలు నిర్వహించ లేదన్నారు. ఆలయంతో పాటు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాధవ రెడ్డి మాట్లాడుతూ ఆలయ నిర్మాణమునకు 15 లక్షల మంజూరు చేస్తామన్నారు. ఈ నెలలోనే ఆలయ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గౌడన్నలు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. వినతి సమర్పించిన వారిలో గౌడ సంఘం అధ్యక్షులు జోరు వీరయ్య గౌడ్. నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ కార్యదర్శి మంద యాకయ్య గౌడ్, దొంతి శ్రీనివాసు, గోడిశాల మల్లేష్, సురేందర్ దొంతి సంతోష్, మాచర్ల ఎల్లగౌడ్, గాదగోని సాంబయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పాడి పశువుల లబ్ధిదారులకు అవగాహన



**సంగెం, ఆగస్టు 5,(జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంలోని శాంతి మండల సమాఖ్యలో మహిళా శక్తి కార్యక్రమంలో ఎంపికైన పాడి పశువుల లబ్ధిదారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీపీఎం భవాని పాల్గొని పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మండలానికి 109 యూనిట్స్ మంజూరైనట్లు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు పశు వైద్యాధికారి డాక్టర్ రాజు వారికి మేలుజాతి గేదెల కొనుగోలు చేయుటకు మెలకువలు తెలిపారు. పాడి పశువుల పెంపకానికి సంబంధించిన విషయాలు, పాల దిగుబడి పెంచుటకు గేదెలకు అందించవలసిన పశుగ్రాశంపై వివరించారు. కొనుగోలు చేసే సమయంలో సరాసరి మూడుపూటల పాలు తీసి సరి చూసుకోవాలని తెలిపారు. 2వ, ఈత పశువులను సెలెక్ట్ చేసుకోవాలని, పొదుగు పొట్టకు అనుకొని విశాలంగా ఉండాలని, పశువు త్రిభుజాకారంలో ఉంటే మేలు జాతి, గ్రేడెడ్ ముర్ర జాతి పశువులను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. ఇంట్లోనే మక్కలతో దాన తయారు చేసుకునే విధానము వివరించారు. దూడలకు 3 నెలల వరకు పాలపైనే ఉంచాలని, నట్టల మందు వేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ గవిచర్ల రాజేష్ రెడ్డి, ఏపిఎం కిషన్, సీసీలు ఎలియా, కృష్ణమూర్తి రాజయ్య, కుమారస్వామి, రాజా ఎమ్మెస్ అధ్యక్షురాలు కళ్యాణి, రాజమణి, కోశాధికారి రేణుక అకౌంటెంట్ సుజాత, కృష్ణ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# సాగర్‌లో జలసవ్వడి

నాగార్జునసాగర్ **ఆగస్టు 5,(జర్నలిస్ట్ వార్త):** నాగార్జునసాగర్ వైపు కృష్ణమ్మ పరవళ్ళు తొక్కుతుండటంతో రిజర్వాయర్ నిండుకుండలా మారింది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నాగార్జునసాగర్‌కు భారీగా ఇన్‌ఫ్లో రావడంతో నీటిమట్టం గణనీయంగా పెరిగింది. సోమవారం ఎన్ఎస్పి అధికారులు సాగర్ ప్రాజెక్టుకు గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. నాగార్జునసాగర్‌కు భారీగా వరద వస్తున్న నేపథ్యంలో మొదట పది గేట్లను ఎత్తి అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. క్రమంగా మరిన్ని గేట్లు ఎత్తే అవకాశం ఉంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో లోతట్టు ప్రాంత ప్రజలను అధికారులను అప్రమత్తం చేశారు. కృష్ణా బేసిన్‌లోని అన్ని ప్రాజెక్టులు నిండుకుండల్లా కనిపిస్తున్నాయి. ఆల్మట్టి, నారాయణ్‌పూర్, జూరాల, తుంగభద్ర, శ్రీశైలం, అన్ని ప్రాజెక్టులు నిండుకుండల్లా మారడంతో అక్కడి నుంచి వరద నీరు మొత్తం ఇప్పుడు నాగార్జునసాగర్‌లోకి వచ్చి చేరుతోంది. దీంతో రెండేళ్ల తర్వాత నాగార్జునసాగర్ ప్రాజెక్టు గేట్లను ఎత్తారు. చివరిసారిగా 2022 ఆగస్టు 11న క్రస్ట్ గేట్లను ఎత్తారు.



# ఫ్రెండ్లీ పోలీస్ కాదు.. ఇది లాఠీ పోలీస్

**(షాద్ నగర్)ఆగస్టు 5,(జర్నలిస్ట్ వార్త):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పినట్టు తమ ప్రభుత్వంలో ఫ్రెండ్లీ పోలీసులు ఉండరని.. లాఠీ పోలీసులు మాత్రమే ఉంటారని చెప్పారని అది షాద్ నగర్ పోలీస్ నిజం చేశారని తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, బీఆర్ఎస్ మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో హరిజన వాడకు చెందిన సునీతను పోలీసులు దొంగతనం కేసులో చిత్రహింసలకు గురి చేశారన్న ఆరోపణలపై ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో స్థానిక ఎమ్మెల్సీ ఎన్. నవీన్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ సారథ్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ సురభి వాణి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్,మాజీ ఎంపీ జగన్నాథం తదితర స్థానిక బీఆర్ఎస్ నాయకుల బృందం బాధితురాలు సునీతను ఆసుపత్రిలో పరామర్శించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ తరపున తక్షణ సాయం కింద ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి 1 లక్ష రూపాయలను ఆర్థిక సాయంగా అందించారు.ఈ సందర్భంగా ఆసుపత్రి డ్యూటీ డాక్టర్ తో సునీత ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.షాద్ నగర్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ రామ్ రెడ్డితో పాటు మరో ఐదు మంది కానిస్టేబుల్స్ ప్రవర్తించిన తీరును బాధితురాలు సునీత వారికి వివరించింది.

### చాలా అవమానీయంగా కొట్టారు.. సబితా ఇంద్రారెడ్డి

దళిత మహిళ సునీతను పోలీసులు చాలా అవమానియంగా కొట్టారని స్థానిక మీడియా ముందు సబితా ఇంద్రారెడ్డి వాపోయారు.ఒక ఆడపిల్లకు మగ పోలీసులు ఇలా చిత్రహింసలకు గురి చేయడం సబబు కాదని ఇది సభ్య సమాజం తలదించుకునే చర్య అని ఆమె ఖండించారు. పోలీసులు సిఐ రాంరెడ్డిని కంటితుడుపు చర్యగా అటాచ్ చేశారని మిగతా ఐదు మంది కానిస్టేబుళ్లపై ఎందుకు చర్య తీసుకోలేదని ఆమె ప్రశ్నించారు. గతంలో కెసిఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు మరియమ్మ అనే మహిళను చిత్రహింసలకు గురి చేస్తే సదరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ తో పాటు ఇతర సిబ్బందిని ఉద్యోగాల నుండి తొలగించడం జరిగిందని గుర్తు చేశారు. సంఘటన జరిగినప్పటి నుండి ఇప్పటివరకు సునీతకు ఎందుకు మంచి వైద్యం ఇప్పించలేదని పోలీసులను, ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అత్యాచారాలు అఘాయిత్యాలు మానభంగాలు ఎక్కువైపోయాయని అన్నారు. ఈ సంఘటనపై స్థానిక ఏసీపీకి నివేదిక అందించడానికి ఇంకా ఎంత సమయం పడుతుందని ఆమె మీడియాతో ప్రశ్నించారు.రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ చేజారిపోయిందని ఆమె వాపోయారు. సునీత కుటుంబాన్ని ఆదుకొని ఆమెపై దాడి చేసిన పోలీసులను వెంటనే ఉద్యోగం నుండి తొలగించాలని సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

### సీఎం అండ చూసి పోలీసులకు పొగరెక్కింది

సీఎం రేవంత్ రెడ్డి అండ చూసుకొని తెలంగాణ పోలీసులకు పొగరెక్కిందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సంచలన వ్యాఖ్యలతో విమర్శించారు.సునీత నోటివెంట నిజాలు వింటుంటే తమకు బాధ



కలుగుతుందని అన్నారు.సిఐ రాంరెడ్డికి నమస్తే పెడితే బాధితురాలు గుండెలపై బూటు కాలుతో తన్నిన సిఐ రాంరెడ్డి తీరు గర్హనీయమని అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి, హోంమంత్రి ఒక్కడేనని ఆయన అండ చూసుకొని పోలీసులు ఇలా చెలరేగిపోతున్నారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సీఎంను చూసుకొని మరోవైపు అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే దానం నాగేందర్ నీ అమ్మ తోలు తీస్తా అంటూ సాటి సభ్యులను బెదిరిస్తూ రౌడీయిజం చేస్తుంటే స్పీకర్ మౌనంగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై గౌరవం లేకుండా ఇద్దరు మహిళ ప్రజాప్రతితులపై నోరు పారేసుకున్న సీఎం రేవంత్ రెడ్డికి ఇలాంటివి సాధారణమే అని అన్నారు. సాయంత్రం ఆరు దాటితే ఆడపిల్లలు పోలీస్ స్టేషన్లో విచారణకు తీసుకోకూడదని విషయం పోలీసులకు తెలియదా పోలీసు కమిషనర్, డిసిపి, ఏసీపీలు ఏం చేస్తున్నారని ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. విచారణ సమయంలో మహిళా పోలీసులు ఏమయ్యారని ప్రశ్నించారు.వేల కోట్ల కుంభకోణం చేసిన వారిని ఇలా ఇంటరాగేషన్ చేసి కొడతారా? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పోలీసులకు సవాల్ విసిరారు.బాధిత మహిళలకు ఒక కోటి రూపాయలు ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు.

### రౌడీ షీటర్ తో నందిగామలో సెటిల్మెంట్లు

రాజకీయ పలుకుబడితో ఈ ప్రాంతంలో అనేక పోలీస్ స్టేషన్లో పోలీసులు విచ్చలవిడిగా కేసులు నమోదు చేస్తున్నారని ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి ఆరోపించారు. నందిగామ పోలీస్ స్టేషన్లో రౌడీషీటర్ ప్రతినిత్యం సెటిల్మెంట్లు చేస్తున్నాడని నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. చదువుకున్న పోలీసు అధికారులు రాజకీయ నాయకుల ప్రలోభాలకు లోబడి లేదా ఒత్తిడికి గురై అమాయకులకు అన్యాయం చేస్తున్నారని నాన్బెయిలబుల్ సెక్షన్లు పెడుతున్నారని అన్నారు. ఇలాంటి సంఘటన జరగడం చాలా దురదృష్టకరమని ఈ ప్రాంతం పై ఉన్న పోలీస్ స్టేషన్లపై ఉన్నతాధికారులు నిఘా పెట్టాలని, వైఫల్యం పోలీసులలో లేదని.. రాజకీయ నాయకుల వైఫల్యం ఉంది కాబట్టే వారిని పావుల్లా వాడుకుంటున్నారనే విషయాన్ని ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి వివరించారు.

### అక్రమ కేసులు పెడుతున్నారు మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్ నగర్ నియోజకవర్గం లోని అనేక పోలీస్ స్టేషన్లలో బాధితులపై అక్రమ కేసులు పెడుతున్నారని దీనిని సైబరాబాద్ కమిషనర్ పరిశీలించాలని స్థానిక మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ కోరారు.అసలు జరిగిన సంఘటన ఏమిటి? ఎలాంటి సెక్షన్లు పెట్టాలి? అనే వాటిని పక్కన పెట్టి నాన్ బెయిలబుల్ కేసుల లక్ష్యంగా తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని వీటిపై దృష్టి సారించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. దళిత మహిళ సునీత విషయం చాలా బాధాకరమని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని అంజయ్య యాదవ్ మీడియా ముందు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్ మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఈట గణేష్,వెంకట్ రెడ్డి,మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# నవోదయ ఏజెన్సీ మాయాజాలం








నర్సంపేట, ఆగస్టు 5,(జర్నలిస్ట్ వార్త):
నర్సంపేట పట్టణ కేంద్రంలో మెడికల్ కాలేజీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ క్రమంలో ఆగస్టు 1వ తేదీ నుండి 4వ, తేదీ వరకు చివరి తేదీగా ప్రకటించారు. ఈ క్రమంలో నవోదయ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఉద్యోగ అవకాశాలు 180 మాత్రమే ఉన్నాయి. వాటికోసం దాదాపు 8,000 మంది నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకున్నారు. సోమవారం నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేస్తున్నారు. అథారిటీ అధికారి లేకుండా కేవలం ఏజెన్సీ వారే ప్రైవేటు వ్యక్తులను పెట్టి, సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయడం పట్ల అనుమానాలకు దారి తీస్తుంది. ఏజెన్సీకి సంబంధించిన వారు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయడం అంటే వారికి అనుకూలంగా ఉన్న వాళ్ళని సెలెక్ట్ చేయడం తప్ప అర్హులైన వారికి గుర్తింపు ఎక్కడ దక్కుతుందని ఆరోపణలు వస్తున్నాయి. దరఖాస్తులు స్వీకరించిన దగ్గర నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ వరకు అథారిటీ అధికారులతో సంబంధం లేకుండా తనదైన శైలిలో ఏజెన్సీ వారు తమ నిర్వహణ కొనసాగించడం పట్ల పలు సమస్యలు తలెత్తుతున్నాయి. కొంతమంది ఆసక్తికర నిరుద్యోగులు కాస్త ఆలస్యం కావడంతో 5వ, తేదీ రోజున ఏజెన్సీ వారిని సంప్రదించారు. ఇచ్చిన గడువ పూర్తయింది ప్రస్తుతం ఏజెన్సీ ఆధ్వర్యంలో దరఖాస్తులు తీసుకోబడని, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ వద్ద సమర్పించమని దరఖాస్తుదారులకు ఏజెన్సీ వారు చెప్పడంతో నూతనంగా నిర్మిస్తున్న కళాశాల భవనం వద్దకు దరఖాస్తుదారులు పరుగులు పెట్టారు. ఇలా నిరుద్యోగుల సమయం వృధా చేస్తూ, ఏజెన్సీ వారు మెడికల్ కాలేజీ అధ్యాపకులు వారితో ఆటలాడుతూ, మాయజాలం ప్రదర్శిస్తున్నారని ఓ బాధితుడు ఆరోపించారు. ఇచ్చిన గడువు పూర్తయిన తర్వాత దరఖాస్తులు తీసుకోవడం పూర్తిగా నిలిపివేయాలి. అంతేకానీ కొంతమంది తన అనుకున్న వారి దరఖాస్తులను తీసుకుని, దరఖాస్తుల 4వ తేదీ రాస్తుండగా తన కళ్ళతో చూసినట్లు, తమ వద్ద ఆధారాలు ఉన్నాయంటూ ఓ నిరుద్యోగి ఆవేదన వ్యక్తం చేశారు. దరఖాస్తు తీసుకోవడం పట్ల అందరికీ ఒకే న్యాయం ఉండాలి, నిర్వాహకులకు తెలిసినవారు, ఉద్యోగాలు కొన్నవారి దరఖాస్తులు తీసుకుంటూ, వారిని నిరాకరించడంతో ఆవేదన చెందిన అభివృద్ధి స్థానిక పోలీస్ స్టేషన్ లో ఏజెన్సీ పై ఫిర్యాదు చేశారు. ఇప్పటికే ఆ ఏజెన్సీ పై నోటిఫికేషన్ జారీ చేసిన సమయం నుంచి ఇప్పటి వరకు చాలా ఉద్యోగాలు అమ్మకాలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒకవైపు దరఖాస్తులు తీసుకుంటూనే మరోవైపు డబ్బులు దండుకుంటున్నారని నర్సంపేట పట్టణ పరిధిలో చర్చ సాగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నవోదయ ఏజెన్సీ పై ప్రత్యేక దృష్టి సారించి, వారిపై చర్యలు తీసుకోవాలని భాదితులు కోరుతున్నారు.

## 10 నుంచి రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఎన్నికలు

**ఆగస్టు 5,(జర్నలిస్ట్ వార్త):**
ఆగస్టు 5 నుంచి ప్రారంభం కావాల్సి ఉండగా ఆగస్టు 10వ తేదీ నుంచి నెల రోజుల పాటు జరగనున్నాయి. ఈ ఎన్నికల ప్రక్రియ మొత్తం ఆన్లైన్లోనే జరుగుతోంది. ఆన్లైన్లో యువజన కాంగ్రెస్లో సభ్యత్వం పొందగానే నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల పదవులకు పోటీ పడుతున్న అభ్యర్థుల పేర్లు తెరపై కనిపిస్తాయి. వారిలో ఇష్టం ఉన్నవారికి టిక్ చేస్తే సభ్యత్వం, ఓటింగ్ రెండూ ఒకేసారి పూర్తవుతాయి.ఎక్కువ ఓట్లు పొందిన వారిని అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులుగా ప్రకటిస్తారు. 35 సంవత్సరాల లోపు వయస్సు గలవారు యువజన కాంగ్రెస్లో సభ్యత్వం పొందడానికి అర్హులు. కాగా అధ్యక్ష పదవి కోసం మొత్తం 23 మంది నామినేషన్ వేయగా 12 మంది అర్హత సాధించారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కూడా యువజన కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీ పడుతున్నారు. ఆయనతో పాటు జక్కిడి శివచరణ్రెడ్డి, పొన్నం తరుణ్ గౌడ్, జి.అర్వింద్, మిట్టపల్లి వెంకటేశ్, హరిప్రసాద్, మహ్మద్ ఇషాక్ షేరు, స్రామ్రాట్ వంశీ, షేక్ ఖైజర్, అక్షత్రెడ్డి, థామస్ సొల్లు, దీపక్ ప్రగ్న పోటీలో ఉన్నారు.

## స్వచ్ఛదనం పచ్చదనం గ్రామసభ

### - గ్రామ ప్రత్యేక అధికారి వి. విజయసాగర్




వర్ధన్నపేట, ఆగస్టు 5,(జర్నలిస్ట్ వార్త): స్వచ్ఛతనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా వర్ధన్నపేట మండలం ఇల్లంత గ్రామంలో గ్రామ సభ ఏర్పాటు చేశారు. సోమవారం వర్ధన్నపేట ఎమ్మార్వో, ఇల్లంద గ్రామ స్పెషల్ అధికారి వి. విజయ్ సాగర్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో భాగంగా వారు మాట్లాడుతూ 5వ, తేదీ నుంచి 9వ, తేదీ వరకు చేపట్టవలసిన అంశాలపై రోజువారి కార్యక్రమాలను గ్రామసభ ద్వారా వివరించారు. ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే సభ దృష్టికి తీసుకు రావాల్సిందిగా సూచించారు. ఈ సభలో చెరువు యొక్క తూము సమస్య గ్రామసభ దృష్టికి తీసుకురావడం జరిగింది కేజీబీవీ, హైస్కూలు, ప్రైమరీస్కూలు, పలు వార్డులలోని లోతట్టు ప్రాంతాల్లో మొరంతో నింపాలని గ్రామస్తులు గ్రామసభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ గ్రామసభలో కార్యదర్శి రామారావు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ఎద్దు సత్యనారాయ, కాంగ్రెస్ జిల్లా నాయకులు పోశాల వెంకన్న, హై స్కూలు ప్రైమరీ స్కూలు ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, అంగన్వాడి కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, వివోఏలు, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామస్తులు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరాన్ని బద్నాం చేసేందుకు రైతుల నోట్లో మట్టికొట్టొద్దు

### భారాస ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి,



దిల్లీ: **ఆగస్టు 5,(జర్నలిస్ట్ వార్త):**
భారాసపై ఉన్న కోపాన్ని రైతులపై చూపకుండా వెంటనే సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని భారాస ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం దిల్లీలోని తెలంగాణ భవన్‌లో వీరు విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరాన్ని బద్నాం చేయాలన్న ఆలోచనతో లక్షల ఎకరాలను ఎండబెట్టి రైతుల నోట్లో మట్టికొట్టొద్దని జగదీశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. "కృష్ణాలో 15 రోజుల క్రితం వరద ప్రారంభమైనా మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రాజెక్టులను నింపలేదు. కల్వకుర్తి ఎత్తిపోతల నుంచి కాలువలకు నీరివ్వడం లేదు. వెంటనే మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని ఎత్తిపోతలను ప్రారంభించి అన్ని కాలువలకు నీళ్లొదలాలి. నల్గొండ జిల్లాలోని కుంటలు, చెరువులు, ఖమ్మం జిల్లాలో పాలేరు కింద ఉన్న చెరువుల్ని నింపాలి. కాళేశ్వరం సుందిళ్ల, అన్నారంలలో నీళ్లు నింపొద్దని ఎన్‌డీఎస్‌ఏ చెప్పి ఉంటే ఆ లేఖను బహిర్గతం చేయాలి' అని డిమాండ్ చేశారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. 'ఓవైపు పంటలు ఎండిపోతోంటే సీఎం, మంత్రులు విదేశీ పర్యటనలకు వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ భారాస ఎమ్మెల్యేలంతా ధర్నాలు చేయబోతున్నారు' అని అన్నారు.



# ఒక్క ట్రైలర్.. చాలా లెక్కలు

సూపర్ హిట్ మూవీ 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్‌గా తెరకెక్కిన చిత్రం.. 'డబుల్ ఇస్మార్ట్'. ఇంకో రెండు వారాల్లోపే ఈ చిత్రం విడుదల కావాల్సి ఉంది.ఆగస్టు 15కు రిలీజ్ డేట్ ఫిక్స్ చేశారు. ఐతే ముందు అనుమానించినట్లుగానే రిలీజ్ ముంగిట ఈ చిత్రానికి తలనొప్పులు తప్పట్లేదు. దర్శక నిర్మాత పూరి జగన్నాథ్ చివరి చిత్రం లైగర్‌కు నష్టాకు సంబంధించిన తలనొప్పులు ఈ చిత్రాన్ని చుట్టుకున్నాయి. లీగల్‌గా చూస్తే పూరి నష్టపరిహారం ఇవ్వాల్సిన అవసరం లేకపోయినా.. లైగర్ మరీ దారుణంగా దెబ్బకొట్టిన నేపథ్యంలో బయ్యర్లు, ఎగ్జిబిటర్లను ఆదుకోవాల్సిన నైతిక బాధ్యత ఆయనపై పడింది. కొన్ని రోజులుగా దీనికి సంబంధించిన పంచాయితీ నడుస్తోంది. ఈ వ్యవహారం ఎంతైనా డబుల్ ఇస్మార్ట్ టీంను కలవరపెడుతూ ఉంటుందనడంలో సందేహం లేదు. మరోవైపు డబుల్ ఇస్మార్ట్‌లో కంటెంట్ ఎంత బలంగా ఉంటుందనే విషయంలో సందేహాలున్నాయి.ఇస్మార్ట్ శంకర్ ఫ్లూక్ హిట్ అనే అభిప్రాయానికి బలం చేకూర్చేలా పూరి తర్వాతి చిత్రం లైగర్ డిజాస్టర్ అయింది. దీంతో ఆయన పనితనం మీద మళ్లీ సందేహాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో 60 కోట్లు పెట్టి డబుల్ ఇస్మార్ట్ థియేట్రికల్ హక్కుల కొన్న నిర్మాత నిరంజన్ రెడ్డికి కూడా రికవరీ అంత తేలిక కాదు.ఇంకోవైపు లైగర్ పుణ్యమా అని థియేటర్ల సమస్య ఉంది. ఇదిలా ఉంటే ఇప్పటిదాకా డబుల్ ఇస్మార్ట్ నుంచి రిలీజ్ చేసిన ప్రమోషనల్ కంటెంట్ ఏమంత గొప్పగా అనిపించలేదు. పాటలు ఓ మోస్తరుగా అనిపించాయి. టీజర్ జస్ట్ ఓకే అనిపించింది. మిస్టర్ బచ్చన్‌తో ప్రమోషన్లలో డబుల్ ఇస్మార్ట్ టీం వెనుకబడిందన్నది స్పష్టం.

# కీర్తి గ్లామర్.. ఇది నెక్స్ట్ లెవెల్




రోమ్‌కు వెళ్తే రోమన్ లాగా ఉండాలి అని ఒక సామెత. అలాగే సినీ పరిశ్రమలో చేసే సినిమాలను బట్టి అప్పీయరెన్స్ ఉండాల్సిందే. సౌత్ ఇండియన్ టాప్ హీరోయిన్లలో ఒకరిగా ఎదిగిన మలయాళ భామ కీర్తి సురేష్ ఒకప్పుడు ట్రెడిషనల్ రోల్సే చేసేది. అందుకు తగ్గట్లే సంప్రదాయబద్ధంగా కనిపించేది.తన పాత్రల్లో ఎప్పుడైనా కొంచెం గ్లామర్ టచ్ ఉన్నా.. అది హద్దులు దాటేది కాదు. క్లీవేజ్ షోలకు ఆమె పూర్తిగా దూరంగా ఉండేది. కానీ ఈ మధ్య కీర్తి మేకోవర్ కోసం గట్టిగా ట్రై చేస్తోంది. గ్లామర్ హీరోయిన్లలో ఎవ్వరికీ తాను తీసిపోనని చాటే ప్రయత్నం చేస్తోంది. మహేష్ బాబు సినిమా 'సర్కారు వారి పాట'లోనే ఆమె మేకోవర్ చూశాం. ఇప్పుడు బాలీవుడ్లో వరుణ్ ధావన్ సరసన సినిమా చేస్తుండడంతో అక్కడి స్టైల్‌కు తగ్గట్లుగా సూపర్ హాట్‌గా తయారవుతోంది కీర్తి. ఈ మధ్య కీర్తి ఏదైనా ఈవెంట్‌కు హాజరైనా, ఫొటోట షూట్ చేసినా అందులో గ్లామర్ డోస్ బాగా ఉంటోంది. మొన్న 'రఘు తాత' అనే సినిమాకు సంబంధించిన ఈవెంట్లో కీర్తి అందాల ఆరబోత చూసి అభిమానులు అవాక్కయ్యారు.ఐతే ఇప్పుడు 'ఫిలిం ఫేర్' అవార్డుల కోసం కీర్తి తయారై వచ్చిన తీరు నెక్స్ట్ లెవెల్ అని చెప్పాలి. అల్ట్రా మోడర్న్ లుక్‌లోకి మారిన ఆమె.. మునుపెన్నడూ లేని స్థాయిలో ఆమె క్లీవేజ్ షో చేసింది. మనం చూస్తున్నది నిజంగా కీర్తినేనా అని ఆశ్చర్యపోతూ కుర్రాళ్లు ఈ ఫొటోలు, వీడియోలను వైరల్ చేస్తున్నారు.

# కార్తీ సర్దార్ 2లో హీరోయిన్ ఫైనల్!




పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో కోలీవుడ్ నటుడు కార్తీ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం సర్దార్ ఈ హిట్ ప్రాజెక్ట్ సీక్వెల్ సర్దార్ 2 కూడా సెట్స్‌పైకి వెళ్లిందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. మిషన్ కంబోడియా నేపథ్యంలో సాగే సర్దార్ 2లో ఇప్పటికే స్టార్ యాక్టర్ కమ్ డైరెక్టర్ ఎస్‌జే సూర్య కీలక పాత్రలో నటిస్తున్నట్టు తెలియజేస్తూ అప్‌డేట్ అందించారు మేకర్స్. ఇప్పటికే తంగలాన్ నటి మాళవిక మోహనన్ కూడా టీంలో జాయిన్ అయినట్టు న్యూస్ షేర్ చేశారు. తాజాగా మరో ఫీ మేల్ లీడ్ రోల్‌లో ఎవరు నటిస్తున్నారనే దానిపై క్లారిటీ ఇచ్చారు మేకర్స్. ముందుగా వచ్చిన వార్తలే నిజమయ్యాయి. ఈ చిత్రంలో అమిగోస్ ఫేం ఆషికా రంగనాథ్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది కార్తీ టీం. ఈ భామ ప్రస్తుతం చిరంజీవి టైటిల్‌రోల్‌లో నటిస్తోన్న విశ్వంభరలో కీ రోల్‌లో నటిస్తోంది. చెన్నైలో వేసిన భారీ సెట్‌లో సర్దార్ 2 షూటింగ్ కొనసాగుతున్నట్టు ఇటీవలే వార్తలు కూడా వచ్చాయని తెలిసిందే. సర్దార్ 2ను కథానుగుణంగా కజకిస్తాన్, అజర్‌బైజాన్, జార్జియాలో చిత్రీకరించేలా ప్లాన్ చేసిందట పీఎస్ మిత్రన్ టీం. ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

# ఆ దుస్తులు మోయలేక ఇబ్బందిపడ్డా!



'హీరామండీ:ది డైమండ్ బజార్'.. బాలీవుడ్ అందాల భామలందరూ ఏకమై వారి నటనతో ప్రేక్షకులను మెప్పించిన సిరీస్ ఇది. ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ దీన్ని రూపొందించారు. ఇందులో కథానాయిక అదితీ రావ్ హైదరీ.. బిబ్బోజాన్ పాత్రలో కనిపిస్తూ.. తన ప్రత్యేక డ్యాన్స్ స్టెప్పులతో సినీప్రియులను మురిపించింది. తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. ఈ సిరీస్ చిత్రీకరణలో ఎదురైన సవాళ్ల గురించి కొన్ని ఆసక్తికర సంగతులను పంచుకుంది. "హీరామండీ'లో సైయాన్ హత్తో జావో గీతంతో నా షూటింగ్ ప్రారంభమైంది. ఈ పాట కోసం బరువైన దుస్తులను, ఆభరణాలను ధరించాను. కానీ.. మొదటి రోజు ముగిసే సమయానికి ఆ దుస్తులను మోయలేక.. నేను ఇంక ఇందులో చేయలేనేమో అనుకున్నాను. దర్శకుడు కోరుకున్న విధంగా నటించడం లేదనే భావన నాలో మొదలైంది. భన్సాలీ నాపై చాలా నమ్మకంతో ఉన్నారు. ఆయణ్ని నిరాశపరచాలని ఎప్పుడూ అనుకోను. ఎంచుకున్న ప్రతీ పాత్రను సవాలుగా తీసుకోవడం నాకిష్టం. అందుకే బిబ్బోజాన్ పాత్రను, 'సైయాన్ హత్తో జావో' పాటను ఛాలెంజింగ్‌గా తీసుకొని చిత్రీకరణ పూర్తిచేశాన"ని ఆ సిరీస్ చిత్రీకరణ సంగతులను గుర్తుచేసుకుంది. ప్రస్తుతం ఈ సిరీస్‌కి కొనసాగింపుగా రాబోతున్న 'హీరామండీ 2' చిత్రీకరణలో ఉంది అదితి.

# విశ్వంభరపై అంచనాలు ఇంకా పెంచేశాడు



బాహుబలి సినిమా చూశాక స్టార్ హీరోలు అందరికీ అలాంటి భారీ స్థాయి పాన్ ఇండియా సినిమా చేయాలని.. ప్రేక్షకులను ఒక కొత్త లోకంలోకి తీసుకెళ్లి విహరింపజేయడం ద్వారా భారీ విజయాన్ని అందుకోవాలని ఆశ పుట్టింది.మెగాస్టార్ చిరంజీవి ఇంతకుముందే 'సైరా నరసింహారెడ్డి' పేరుతో పాన్ ఇండియా స్థాయి సినిమానే చేశాడు. కానీ ఆ చిత్రం ఆశించిన ఫలితాన్నివ్వలేదు. దీంతో మళ్లీ మామూలు సినిమాలకే పరిమితం అయ్యారు. కానీ ఇప్పుడు ఆయన చేస్తున్న 'విశ్వంభర' వేరే లెవెల్ అన్నది టీం వర్గాల మాట. ఈ సినిమా టీజర్ చూసినా.. చిరు ఏదో ఎక్స్‌ట్రార్డినరీ సినిమానే చేస్తున్న ఫీలింగ్ కలిగింది. 'జగదేక వీరుడు అతిలోక సుందరి', 'అంజి' తరహాలో ఫాంటసీ టచ్ ఉన్న విజువల్ వండర్ ట్రై చేస్తున్నట్లున్నాడు 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ. ఎక్కువ హడావుడి చేయకుండా అతను తన టీంతో కలిసి సైలెంటుగా సినిమాను లాగించేస్తున్నాడు.సంక్రాంతికే 'విశ్వంభర' ప్రేక్షకుల ముందుకు రానుండగా.. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఈ చిత్రం మీద హైప్ పెరిగేలా మాట్లాడాడు వశిష్ఠ. ఈ చిత్రానికి 'జగదేక వీరుడు అతిలోక సుందరి' లాంటి సినిమాలే రెఫరెన్స్ అనే విషయాన్ని మరోసారి నొక్కి వక్కాణించిన వశిష్ఠ.. ఆ సినిమాలాగే 'విశ్వంభర' చరిత్రలో నిలిచిపోతుందని చెప్పాడు.చిరంజీవి కెరీర్లో టాప్-5 సినిమాలు తీసుకుంటే.. అందులో 'విశ్వంభర' కూడా ఒకటిగా ఉండేలా దీన్ని తీర్చిదిద్దుతున్నామని వశిష్ఠ చెప్పాడు. చిరు అభిమానులు చాలా కాలం ఈ సినిమాను గుర్తుంచుకుంటారన్నాడు.